ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
సోమవారం 11 మార్చి 2024

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఆమనగల్లు, మార్చి 10 : రాజీమార్గం రాజమార్గమని ఆమనగల్లు సీఐ ప్రమోదర్‌కుమార్ అన్నారు. సోమవారం నుంచి 16వ తేదీ వరకు రాజీపడదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఆమనగల్లు పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆదివారం సీఐ మాట్లాడుతూ పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ దోహద పడుతుందన్నారు. ఆమనగల్లు సర్కిల్ పరిధి ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేటి నుంచి జాతీయ లోక్ అదాలత్ ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు బాల్‌రామ్‌నాయక్, శ్రీకాంత్ ఉన్నారు.

- పెరిగిన నీటి వినియోగం.. తగ్గుతున్న లభ్యత
- శేరిలింగంపల్లి, హయత్‌నగర్ ప్రాంతాల్లో భారీగా పడిపోయిన నీటి మట్టాలు
- ఎండుతున్న చెరువులు, కుంటలు, బోరుమంటున్న బోర్లు
- తడులందక ఎండుతున్న యాసంగి చేలు, ముంచుకొస్తున్న తాగునీటి ఎద్దడి
- నీటిని పొదుపు చేయాలంటున్న నిపుణులు


యాచారం మండలం మేడిపల్లిలో పూర్తిగా ఎండిపోయిన ఎర్ర చెరువు

మంచాల మండలం తిప్పాయపల్లిలో ఎండిన వరి చేను

జలం అధఃపాతాళం!

పడిపోతున్న భూగర్భ జలమట్టం.. మోగుతున్న ప్రమాద ఘంటికలు

రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలమట్టాలతో అటు రైతులు, ఇటు సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఒక పక్క నీరందక పంటలు ఎండుతుంటే మరోవైపు గుక్కెడు తాగునీటికి జనం అగచాట్లు పడుతున్నారు. ఎండలు మొదలవుతున్నప్పుడే ఈ పరిస్థితి ఉంటే కాలం ముదిరితే ఇంకెలా ఉంటుందోనని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ భూగర్భ జలమట్టాలు పడిపోతున్నాయి. పట్టణాల్లో మరింత వేగంగా నీటి మట్టాలు తగ్గుతున్నాయి. జిల్లాలో 2023 ఫిబ్రవరిలో సగటు భూగర్భ జలమట్టం 8.19 మీటర్లు ఉండగా 2024 ఫిబ్రవరి వచ్చేసరికి నీటిమట్టం 11.59 మీటర్లుగా నమోదైంది. ఏడాది కాలంలో నీటిమట్టం అదనంగా 3.39 మీటర్లు పడిపోయింది. గత వానాకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవకే ఈ పరిస్థితి ఏర్పడింది. ఉన్న నీటిని వచ్చే వానాకాలందాకా పొదుపుగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 10): పోయిన వానాకాలం వానలు సమృద్ధిగా కురవలేదు. ఈ సారి మార్చిలోనే ఎండలు మండుతున్నాయి. పంటలకు పారుకాలతో జిల్లాలో ఎక్కడికక్కడ భూగర్భ జలమట్టం వేగంగా పడిపోతోంది. రోజురోజుకూ తగ్గుతున్న జలమట్టాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. పల్లెలు, పట్టణాల్లో అనే తేడా లేకుండా అంతటా నీటివినియోగం భారీగా పెరిగి భూగర్భ జల మట్టాలు వేగంగా పడిపోతున్నాయి. ఇంచ్‌లు, ఫీట్లు కాదు.. ఏకంగా మీటర్ల లోతులకు జలమట్టాలు పడిపోతున్నాయి. పంటలకు, తాగునీటికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. జిల్లాలో 68బావుల్లో భూగర్భ జల మట్టాలను భూగర్భ(జియాలజీ) పరిశోధన శాఖ అధికారులు పరిశీలించారు. 2023 ఫిబ్రవరి సగటు భూగర్భ జల మట్టం 8.19మీటర్లుండగా 2024 ఫిబ్రవరిలో సగటు నీటి మట్టం 11.59మీటర్లు నమోదైంది. గతేడాదితో పోలిస్తే నీటి మట్టం సగటున -3.39 మీటర్లుగా నమోదైంది. గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో నీటి వినియోగం బాగా పెరిగింది. ముఖ్యంగా జిల్లాలోని శేరిలింగంపల్లి, హయత్‌నగర్ మండలాల్లో నీటిమట్టాలు అసాధారణంగా పడిపోయాయి. రానున్న 3నెలల చాలా ప్రాంతాల్లో నీటి కటకట నెలకొనే పరిస్థితి కన్పిస్తోంది. హయత్‌నగర్‌లో 202ఫిబ్రవరిలో జలమట్టం 8.45 మీటర్లుండగా 2024 ఫిబ్రవరిలో 17.63 మీటర్ల లోతుకు పడిపోయింది. ఏడాదిలో జలమట్టం 11.48 మీటర్ల కిందికి పోయిందన్నమాట! శేరిలింగంపల్లి ప్రాంతంలో జలమట్టం 2023 ఫిబ్రవలో 15.36మీటర్లుండగా 2024 ఫిబ్రవరిలో 30.15మీటర్లకు పడిపోయింది. ఇక్కడ జల మట్టం 14.79మీటర్ల మైనస్‌లోకి పోయింది. కాగా జిల్లాలో 2,170 చెరువులున్నా ఎక్కువ చోట్ల ఎండకు నీరు ఆవిరై అడుగంటుతోంది. పొలాల పారుకం కష్టంగా మారింది.

తగినన్ని వానలు పడకనే నీటి కష్టాలు

గత వానాకాలంలో వర్షాలు అనుకున్నంత కురియక భూమిలో నీటి రీచార్జి కాలేదు. జలమట్టాలు పెరగలేదు. దీంతో యాసంగి సాగు విస్తీర్ణం బాగా పడిపోయింది. జిల్లాలో సాధారణ సాగు 99,306 ఎకరాలు కాగా ఈ సారి 20,789 ఎకరాల్లోనే వరి, గోధుమ, మొక్కజొన్న, పెసర్లు, శనగ, కుసుమ, మినుములు, వేరుశనగ, ఆముదం, పొద్దు తిరుగుడు తదితర పంటలు వేశారు. బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పొలాలకు నీరందే పరిస్థితి లేదు. కొన్ని ప్రాంతాల్లో ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు వివిధ ప్రయత్నాలతో అగచాట్లు పడుతున్నారు. ట్యాంకర్లతో నీరు పోస్తున్నారు. వరి, మామిడి పంటలకు కనీసం మరో 50రోజులకుపైగా నీరు పారించాల్సిందే. నగర శివారులో ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో తాగునీటి కటకట ఏర్పడింది. మిషన్ భగీరథ నీరు కొన్నిచోట్ల సరిగ్గా పరఫరా కావడం లేదు. అక్కడక్కడ పైప్‌లైన్లు పగిలి నీరు వృథా కూడా జరుగుతోంది. ఇలాంటివి అరికట్టకుంటే వేసవిలో మరిన్ని తాగునీటి ఇబ్బందులు తప్పవు!

పంటలెండి రైతుల బెంబేలు...

పడిపోతున్న భూగర్భ జలమట్టాలు రైతులకు ఆందోళన కల్గిస్తున్నాయి. నీటి మట్టాలు అథఃపాతాళానికి పడిపోతున్నాయి. బోర్లు నీరుపోయక ఎండుతున్న వరిచేనును పశువుల మేతగా వదిలేస్తున్నారు. ఇంత ఎండల్లోనూ కొందరు రైతులు ఆశగా బోర్లు వేస్తూ అప్పుల పాలవుతున్నారు. ఎన్నిబోర్లు వేస్తున్నా నీరు పడటం లేదు. ఎంత లోతు వేసినా దుమ్ము రేగుతోందే తప్ప నీటి జాడ కన్పించడం లేదు. కేశంపేట మండలంలో బోర్లలో పడిపోతున్న నీటి మట్టంతో పంట చేతికందుతుందా? అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్చిలో 20 రోజులు, ఏప్రిల్ నెల మొత్తం, మే నెలలో కనీసం పది రోజుల వరకు పంటలకు నీరు పారాలి. ఇప్పుడే గ్యాప్ ఇచ్చుకుంటూ పోస్తున్న బోర్లు అప్పటి వరకు పోస్తాయో లేదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారం మండలం మేడిపల్లి, చిన్నతూమ్లల్లో చెరువులెండి మట్టి తేలింది. మంచాల, కడ్తాల మండల్లాలో బోర్లు గ్యాప్ ఇస్తున్నాయి. మంచాల మండలంలో మామిడితోటలకు రైతులు ట్రాక్టర్ ట్యాంకర్లతో నీటిని కొని పోస్తున్నారు. పంట చేతికందే దాకా ఇదే పరిస్థితి ఉంటుందని రైతులు వాపోతున్నారు.


కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేటలో గ్యాప్ ఇస్తూ పోస్తున్న బోరు

భూగర్భ జల మట్టాలు తగ్గిన మండలాలు (మీటర్లలో)

మండలం	ఫిబ్రవరి 2023	ఫిబ్రవరి 2024	తగ్గుదల
అబ్దుల్లాపూర్‌మెట్టు	6.57	8.95	- 3.71
ఆమనగల్లు	6.89	9.11	- 2.98
బాలాపూర్	4.40	10.18	- 3.66
చేవెళ్ల	10.28	12.33	- 2.95
చౌదరిగూడెం	9.43	12.44	- 6.18
ఫరూక్‌నగర్	7.43	10.89	- 4.24
గండిపేట్	10.24	11.41	- 0.80
హయత్‌నగర్	8.45	17.63	- 11.48
ఇబ్రహీంపట్నం	9.20	16.50	- 8.27
కడ్తాల	9.40	13.96	- 6.25
కందుకూరు	3.84	8.63	- 5.94
కేశంపేట	4.74	6.08	- 2.15
కొందుర్గు	6.22	7.99	- 2.75
కొత్తూరు	8.13	12.12	- 5.98
మాడ్గుల	6.95	9.56	- 3.34
మహేశ్వరం	8.37	12.11	- 4.52
మంచాల	5.77	13.11	- 8.15
మొయినాబాద్	8.96	9.61	- 2.26
నందిగామ	6.38	11.90	- 6.83
రాజేంద్రగనర్	12.91	10.89	- 0.99
సరూర్‌నగర్	9.29	11.25	- 3.04
శేరిలింగంపల్లి	15.36	30.15	- 14.79
షాబాద్	9.17	12.54	- 0.72
శంషాబాద్	8.59	9.69	- 2.13
శంకర్‌పల్లి	11.15	12.27	- 2.81
తలకొండపల్లి	12.37	17.25	- 6.16
యాచారం	4.37	8.57	- 4.75



బోరు గ్యాప్ ఇచ్చుకుంటా పోస్తుంది

ప్రతి ఏటా పూల సాగు చేస్తున్నాను. ఈ సారి కూడా నాలుగు ఎకరాల్లో గులాబి తోట సాగు చేశాను. ముదురుతున్న ఎండలకు భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. ఇంతకు ముందు పూల తోటకు 4గంటలు నీరుపారబెట్టేవాన్ని. ఎండలకు ఇప్పుడు రోజంతా నీరు పారించాల్సి వస్తోంది. బోరు గ్యాప్ ఇచ్చుకుంటా పోస్తుంది. నీరు సరిపోవడం లేదు.

- అంజయ్యయాదవ్, పూల రైతు, నందిగామ



బోరులో నీరొస్తలేదు.. చేను ఎండుతుంది

ఈ ఏడాది కాలంగాలె. నేను నాలుగు ఎకరాల్లో వరి వేశాను. మామిడి తోట కూడా ఉంది. వరి పొట్టదశకు వచ్చింది. నీటి మట్టం పడిపోయి బోరు ఎండిపోయింది. పది రోజుల్లో రెండు బోర్లు వేసినా సుక్క నీరన్న పడలె. చుట్టుపక్కల బోర్లూ ఎండిపోతున్నాయి. పంటలన్నీ ఎండుతున్నాయి. పంటకు ఇప్పటికే ఎకరానికి రూ.20వేలకు పైనే ఖర్చు చేశాను. ఎండుతున్న వరిని గొర్లమేతకు ఇచ్చేయాలని చూస్తున్న. మూడేళ్లు పంట బాగానే పండింది. పోయిన వానకాలం వానలు పడక కథ మల్లా మొదటికొచ్చింది. ఏం చేయాలో తోచడం లేదు.

- వెదిరె రాంరెడ్డి, రైతు, తిప్పాయిగూడ, మంచాల మండలం



బోర్లు నీళ్లు పోయక భయమైతుంది

నేను రెండెకరాల్లో వరి వేశాను. లక్ష వరకు పెట్టుబడైంది. త్రీ ఫేజ్ కరెంటు 24గంటలు వస్తోంది. కరెంటుతోని ఇబ్బంది లేదు. రెండు బోర్లున్నాయి. బోర్లు నీరు తక్కువ పోస్తున్నాయి. రోజురోజుకూ నీరు తక్కువవుతోంది. ఎండలు ముదిరినాకొద్దీ బోర్ ఎండిపోతే పంట చేతికందడం కష్టమే. వరి పొట్ట దశ, ఈనే సమయంలో నీరు ఎక్కువ అవసరం. ఇప్పుడు బోర్లు ఎత్తిపోయేలా ఉన్నాయి. ఈ సారి వానలు బాగ పడలేదు. దీంతో బోర్లు పోస్తాయోలేదోనని భయమైతుంది.

- మైసయ్య, రైతు, చిన్నతూమ్లు, యాచారం మండలం

నీటిని పొదుపుగా వాడుకోవాలి

పట్టణ ప్రాంతాల్లో నీటి వినియోగం భాగా పెరిగింది. అవసరానికి మంచి నీటిని ఖర్చు చేస్తున్నారు. జనం నీటిని పొందుపుగా వాడుకుంటేనే నీటి సమస్యలు రావు. ఈ ఏడాది ఇప్పటికే జిల్లాలో 68 బావుల్లో భూగర్భ జల మట్టాలను పరిశీలించాం. 2023 ఫిబ్రవరిలో భూ గర్భ జలాలు సగటున 8.19మీటర్ల లోతులో ఉండగా 2024 ఫిబ్రవరి వచ్చేసరికి నీటి మట్టాలు 11.59 మీటర్లకు పడిపోయాయి. 12 నెలల్లో 3.39 మీటర్ల నీటిమట్టం పడిపోయిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

- ఆర్‌ఎస్.నర్సింహారావు, భూగర్భ జలవనరుల శాఖ అధికారి

శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకున్న ఉమ్రా యాత్రికులు


ఉమ్రా యాత్ర పూర్తి చేసుకొని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న యాత్రికులు

శంషాబాద్ రూరల్, 10 : ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తిచేసుకున్న ముస్లింలు తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. యాత్రికుల్లో రెండు తెలుగు రాష్ట్రాల వారు ఉన్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో యాత్ర అనుభవాలను వివరించారు. మరో రెండు రోజుల్లో రంజాన్ మాసం మొదలు కానున్న నేపథ్యం ఉమ్రా యాత్ర చేయడం తమ పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నామని అన్నారు. ఉమ్రా యాత్రలో 15రోజుల పాటు మక్కా, మదీనాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు. ప్రతీ ముస్లిం జీవితంలో ఒక్కసారైనా ఉమ్రా యాత్ర చేయాలన్నారు. ఒక రోజు ఉపవాస దీక్షలు కూడా చేశామన్నారు. 15 రోజుల్లో తమకు ఎలాంటి అసౌకర్యం కలగలేదన్నారు. ఉమ్రా యాత్ర విజయవంతంగా పూర్తికావడం సంతోషంగా ఉందన్నారు. విమానాశ్రయం వద్ద యాత్రికులకు పూల మాలలు వేసి సత్కరించారు. శుభాకాంక్షలు చెప్పిన వారిలో అల్ మిజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఎండీలు హఫీజ్ మహమ్మద్, మహమ్మద్ ఫయాజ్ అలీ ఉన్నారు. కాగా రానున్న రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వారు కోరారు. రంజాన్ మాసంలో భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు చేపట్టాలని సూచించారు.

గ్రామానికి రోడ్డేయాలని యువకుల నిరసన



రోడ్డుపై నిరసన తెలుపుతున్న తుమ్మలూరు యువకులు

మహేశ్వరం, మార్చి 10: సంవత్సర కాలంగా అసంపూర్తిగా ఉన్న తమ ఊరు రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసి, రోడ్డు పక్కన ఐదారు మీటర్ల ఎత్తు వేసిన మట్టిని తొలగించాలని డిమాండ్ చేస్తూ తుమ్మలూరు గ్రామ యువకులు శ్రీశైలం-హైదరాబాద్ రహదారి తుమ్మలూరు గేటు వద్ద ఆదివారం ధర్నాకు దిగారు. ఏడాదిగా రోడ్డు పనులు చేయకుండా వదిలేయడంతో రోజూ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, కంకర రాళ్లలో రోడ్డుపై ప్రయాణం చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నామన్నారు. తాము ఇన్ని ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడు లేడని యువకులు మండిపడ్డారు. రోడ్డు పనులు చేసే వరకు ధర్నా విరమించం అన్నారు. అక్కడికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, కలెక్టర్, రోడ్డు కాంట్రాక్టర్ వచ్చే వరకు అక్కడే కూర్చుంటాం అని యువకులు నినాదాలు చేశారు. దీంతో 3గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అక్కడికి చేరుకున్న మహేశ్వరం ఎస్సై రవీందర్ యువకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా యువకులు ధర్నా విరమించలేదు. గ్రామస్తుల ధర్నా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితారెడ్డి ఫోన్లో సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. మూడు రోజుల్లో తుమ్మలూరు వరకు బీటీ వేయాలని ఎమ్మెల్యే ఆదేశించగా పనులకు కాంట్రాక్టర్ ఒప్పుకోవడంతో యువకులు ధర్నా విరమించారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి


పనులను పరిశీలిస్తున్న డీపీవో సురేశ్ మోహన్

ఆమనగల్లు, మార్చి 10 : ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్ కోరారు. ఎండ కాలం నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. చెన్నంపల్లిలో ఆదివారం డీపీవో పర్యటించారు.పంచాయతీ కార్యాలయం, డంపింగ్ యార్డ్, వైకుంఠధామం, నర్సరీలను డీపీవో పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అసంపూర్తి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో ఎక్కడా అలసత్వానికి తావులేదని ఆయన హెచ్చరించారు. మొక్కల పెంపకానికి స్థలాలను సిద్ధం చేయాలని, వేసవిలో నర్సరీల్లో మొక్కలు ఎండకుండా నీరు పోయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫారూఖ్‌హుస్సేన్, ఎంపీవో శ్రీలత, పీఎస్ ఇందిర, గ్రామస్తులు ఉన్నారు.

రమణీయం.. లక్ష్మీవేంకటేశ్వరుడి దోపోత్సవం

- తెల్లవారుజాము 2 గంటల వరకూ కార్యక్రమాలు, పూజలు
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు


దోపోత్సవం సందర్భంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న భక్తులు


అలివేలు మంగమ్మ ఊరేగింపు


వేడుకలకు హాజరైన భక్తులు

చేవెళ్ల, మార్చి 10 : చేవెళ్లలో గల ప్రసిద్ధ శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద దోపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి అమవాస్య సందర్భంగా శనివారం రాత్రి 9గంటల నుంచి ఆదివారం తెల్లవారు జాము 2గంటల వరకూ లక్ష్మీవేంకటేశ్వరుడి దోపోత్సవం, పూజలను భక్తులు, పూజారులు కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి స్వామి వారి పుష్కరిణి వరకు దేవతామూర్తుల ఊరేగింపు డప్పు వాయిద్యాలు, సన్నాయి మేళతాళాల మధ్య వైభవోపేతంగా నిర్వహించారు. అలివేలు మంగను సైతం ఊరేగింపుగా పుష్కరిణికి తీసుకువచ్చారు. అనంతరం కోయ చెంచుల ఆటపాటల మధ్య స్వామివారి ఆభరణాలను దోచుకునే ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. దోపోత్సవాన్ని తిలకించేందుకు షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, సంగారెడ్డి, షాద్‌నగర్, వికారాబాద్, పూడూర్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, ట్రాఫిక్ సీఐ వెంకటేశంల నేతృత్వంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీం భరత్, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జడ్పీటీసీ మాలతికృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, చేవెళ్ల మాజీ సర్పంచ్‌లు బి.శైలజాఆగిరెడ్డి, వెంకటమ్మవిఠలయ్య, నాగమ్మ, ప్యాక్స్ చైర్మన్ దేవరవెంకటరెడ్డి, ఎంపీటీసీలు వసంతం, రాములు, ఆలయ మేనేజర్ నరేందర్, ఆలయ ధర్మకర్తలు శ్రీకాంత్‌చారి, శ్రీపాద్, వామనాచార్యులు, రాఘవేంద్రచార్యులు, పూజారులు అనంతం, వాసుదేవచార్యులు కన్నా, వైభవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా లక్ష్మీవేంకటేశ్వర స్వామి పుష్కరిణి వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వక్తల ఆధ్యాత్మిక కార్యక్రమం రమణీయంగా సాగింది. రాత్రి 7 నుంచి 10గంటల వరకు పూజా కార్యక్రమాలు కొనసాగాయి.

ఘనంగా అగ్నిగుండ ప్రవేశాలు


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తురాలు

ఆమనగల్లు, మార్చి 10: మండల పరిధిలోని రాంనుంతల గేటు సమీపంలో గల అయ్యసాగర్ త్రిపురాంతకేశ్వర వీరభద్రస్వామి భద్రకాళి సరస్వతి, రామాంజనేయ ఆలయాల్లో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున అగ్నిగుండాలు కార్యక్రమాన్ని అత్యంత శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అగ్నిగుండంలో భక్తులు నిప్పులపై నడిచి తమ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా మహిళల పూనకాలు, యువకుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. లేమామిడికి చెందిన అర్చకుడు మఠం శేఖరయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిగుండం కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. అనంతరం ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోన శ్రీనునాయక్, ఎంపీటీసీ సరితపంతూనాయక్, ఆలయ నిర్వాహకులు భట్టు నర్సిరెడ్డి, ఎన్టీ పంచాక్షరి, మల్లప్ప, వైద్యనాథ్, కరుణాకరరెడ్డి, యాదగిరిరెడ్డి, వీరయ్య, పంతూనాయక్, ఆనంద్, యాదిలాల్, అరుణ్, చందర్, అర్చకుడు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


స్వామివారి రథాన్ని లాగుతున్న భక్తులు

వేడుకగా నందీశ్వరుడి రథోత్సవం

యాచారం, మార్చి 10 : మండల పరిధి నందివనపర్తి నందీశ్వరాలయంలో ఆదివారం ఉదయం ఐదు నుంచి 7గంటల వరకు స్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.భ్రమరాంభమల్లికార్జునులకు పూజలు చేశారు. రథంపై నందీశ్వరులను రథంపై ప్రతిష్ఠించి రథోత్సవాన్ని నిర్వహించారు. రథాన్ని లాగేందుకు నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు పోటీపడ్డారు. జాతరలో వైద్యాధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా యాచారం ఇన్‌స్పెక్టర్ శంకర్‌కుమార్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



నేడు మండల సర్వసభ్య సమావేశం

ధారూరు, మార్చి 10: మండల సర్వసభ్య సమావేశం సోమవారం(నేడు) నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మండల పరిషత్తు కార్యాలయం సమావేశ మందిరంలో సమావేశం ప్రారంభమవుతుందని ఆమె చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆమె కోరారు.







స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలి

కొడంగల్, మార్చి 10: ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం కొడంగల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి గాంధీనగర్ వరకు డీఎస్పీ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఫ్లాగ్‌మార్చ్ ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై భరత్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


కొడంగల్‌లో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

పారిశుధ్య సిబ్బందికి బ్రహ్మకుమారీస్ సన్మానం

వికారాబాద్, మార్చి 10: బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శ్రీరామమందిరం వద్ద ఏర్పాటు చేసిన మహాశివరాత్రి ఉత్సవాల వేడుకల్లో ఆదివారం పారిశుధ్య సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వికారాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో భాగంగా ఉదయం 4గంటలకే పారిశుధ్య పనులు కొనసాగుతున్నాయన్నారు. పారిశుధ్య సిబ్బంది సేవలను గుర్తించి సన్మానించిన మధు అక్కయ్యకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ ఏసు, జవాన్లు వినోద్, చిన్నయ్య, రాజు, ఆశయ్య, శంకర్, బ్రహ్మకుమారీస్ పాల్గొన్నారు.


మునిసిపల్ పారిశుధ్య విభాగం ఉద్యోగులను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ మంజుల రమేష్

మహేష్ శాస్త్రికి జ్యోతిష్య శిరోమణి అవార్డు


మహేష్‌కుమార్ శాస్త్రిని సన్మానిస్తున్న నిర్వాహకులు

వికారాబాద్, మార్చి 10: ప్రముఖ పురోహితుడు కొడంగల్ మండలం ఎన్కేపల్లి గ్రామానికి చెందిన జంగం మహేష్ శాస్త్రి జ్యోతిష్య శిరోమణి అవార్డు అందుకున్నారు. కొడంగల్, తాండూరు, పరిగి, వికారాబాద్, కోస్గి ప్రాంతాల్లో పురోహితం, జ్యోతిష్యంలో మంచి గుర్తింపు పొందిన మహేష్ శాస్త్రిని ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ జ్యోతిష్య శిరోమణి అవార్డుతో సత్కరించింది. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళాభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ ఫౌండర్ డాక్టర్ సి.నరసింహస్వామి మహేష్‌శాస్త్రికి జ్యోతిష్య శిరోమణి అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. జ్యోతిష్య శిరోమణి అవార్డు అందజేసిన ఎన్ఎస్ లైవ్ ఆస్ట్రో సంస్థ వ్యవస్థాపకులు, గురువులకు మహేష్ శాస్త్రి ధన్యవాదాలు తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆహ్వానం

నవాబుపేట, మార్చి 10: చించల్‌పేట్‌లో సోమవారం నుంచి ఈనెల 14వరకు నిర్వహించే ఊరడమ్మ గ్రామ దేవత నాభిశీల, బొడ్రాయి యంత్ర విగ్రహ ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, పరిగి మాజీ ఎమ్మెల్యే కే.మహేశ్‌రెడ్డిలకు ఆదివారం ఆహ్వాన పత్రికలు అందించాలని, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాలని కోరారు.


ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య









శ్రీనివాస్‌కు నియామకపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలి

యాచారం, మార్చి 10 : త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం ప్రతీ కార్యకర్త అంకిత భావంతో పని చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ యాచారం మండల ప్రధాన కార్యదర్శిగా మాల్‌కు చెందిన బట్టు శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆదివారం ఎమ్మెల్యే నగరంలోని ఆయన నివాసంలో నియామకపత్రం అందజేసి మాట్లాడారు. శాసనసభ ఎన్నికలప్పుడు పార్టీ విజయం కోసం పనిచేసినట్లుగా.. ఎంపీ ఎన్నికల్లో కూడా అదే ఉత్సాహంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఆరు గ్యారంటీలను ప్రతీ ఇంటికి అందేలా నాయకులు, కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. ఉచిత బస్సు ప్రయాణంపై విపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రకటనలను తిప్పికొట్టాలని మల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మస్కు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అవకాశమిస్తే పాలమూరు గొంతుకనవుతా

● మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి

షాద్‌నగర్, మార్చి 10 : ప్రజలు ఎన్నికల్లో గెలిపించి ఎంపీగా అవకాశమిస్తే పాలమూరు గొంతుకనవుతానని మహబూబ్‌నగర్ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. తనకు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసే అవకాశాన్ని కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధిష్టానానికి రుణపడి ఉంటానని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తనను గెలిపిస్తే నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఏడు నియోజకవర్గాల ఎమ్మెల్యేల ఆశీస్సులు తనకు ఉన్నాయని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఎలా గెలిపించారో.. తనను కూడా పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. తాను గెలిస్తే పార్లమెంట్‌లో పాలమూరు ప్రజల గొంతును వినిపిస్తానన్నారు. ముఖ్యమంత్రి ముద్దుబిడ్డ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీస్సులు కూడా తనకు కావాలన్నారు.

భారీ మెజార్టీతో గెలిపిస్తాం - ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మమబూబ్‌నగర్ నుంచి వంశీచంద్‌ను భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపిస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఇందుకోసమే లౌకిక శక్తుల పునరేకీకరణ కోసం సర్వం ఒడ్డుతామన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం కుటుంబాలకు కూడా సమయం ఇవ్వకుండా తాను, వంశీ నిరంతరం ప్రజల మధ్యనే ఉంటున్నామన్నారు. గతంలో పాలమూరు నుంచి గెలుపొందిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రజల సమస్యల గురించి గొంతెత్తలేదని, వంశీచంద్ మా త్రం పార్లమెంట్‌లో పాలమూ రు ప్రజాగొంతుకను వినిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వంశీచంద్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించడానికి క్షేత్రస్థాయిలో కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, బాబర్‌ఖాన్, రఘు, చెన్నయ్య, తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, జంగా నరసింహ, రాజు, వీరేశం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ : మీడియాతో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

అనంత పద్మనాభుడి ఆశీస్సులతో విజయం సాధిస్తా

కొత్తూర్/కేశంపేట : పెంజర్ల శ్రీఅనంతపద్మనాభస్వామి ఆశీస్సులతో పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తానని వంశీచంద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పెంజర్ల అనంతపద్మనాభస్వామి ఆలయంలో ఆదివారం వంశీచంద్‌రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ అనంతపద్మనాభస్వామిని దర్శించుకుంటే అంతా మంచే జరుగుతుందన్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ బెజవాడ అనితారెడ్డి వంశీని శాలువాతో సన్మానించారు. మాజీ జడ్పీటీసీ శ్యాసుందర్‌రెడ్డి, ఎంపీటీసీ అంజమ్మ, మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు అంబటి ప్రభాకర్, రవికుమార్‌గుప్త, సిద్ధార్థరెడ్డి, వస్పుల మహేందర్, దయానంద్‌గుప్త, నవీన్‌చారి, ఎర్రోళ్ల జగన్, లింగారం సురేష్‌గౌడ్, పాముల రమేష్, రాందాస్‌నాయక్, రమేష్, సుధాకర్, చింతసాయితేజశ్వర్, రాజు, తదితరులున్నారు. అదేవిధంగా కేశంపేట మండలం భైర్కాన్‌పల్లిలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా పోస్టర్‌ను ఎమ్మెల్యే క్యాంపు కార్యాయలంలో వీర్లపల్లి శంకర్, వంశీచంద్‌రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రూప్లానాయక్, యాదగిరిచారి, వై.గిరిధర్, అంజయ్య, రాఘవేందర్‌రావు, కుమార్, గణేష్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వంశీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు : ఏఐసీసీ కార్యదర్శి, కల్వకుర్తి మాజీ ఎమ్మె ల్యే చల్లా చల్లా వంశీచంద్‌రెడ్డిని ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతిశ్రీనివాస్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆయా మండలాల నాయకులు వంశీచంద్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లను షాద్‌నగర్‌లో కలిశారు. మహబూబ్ నగర్ కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఖరారైన నేపథ్యంలో శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు అజీం, రవీందర్, బాల్‌రాజ్, రామలక్ష్మణ్, హీరా సింగ్, జవహర్‌లాల్, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్ తదితరులు వంశీని కలిశారు.

బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి రాజీనామా



మేడ్చల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో బీజేపీకి గట్టి షాక్ తగిలింది. భారతీయ జనతా పార్టీ మేడ్చల్-మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు హరీష్‌రెడ్డి ఆదివారం సాయంత్రం పదవికి, పార్టీ క్రియాశీలక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించారు. పార్టీలో గత 30 సంవత్సరాలుగా తనకు సహకరించిన ప్రతిఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమయం వచ్చినప్పుడు రాజీనామా గురించి తప్పకుండా చెబుతానని హరీష్‌రెడ్డి తెలిపారు. కాగా, జిల్లా అర్బన్ అధ్యక్షుడు రాజీనామా చేయడంతో చర్చనీయంశంగా మారింది.

పార్కు స్థలాన్ని కాపాడాలి

● సాయిశ్రీ నిలయం కాలనీవాసుల నిరసన ● రియల్టర్.. సొసైటీ భూమిని ఇతరులకు విక్రయించాడని ఆందోళన



పార్కు స్థలంలో ప్రహరీ నిర్మించిన రియల్టర్

మేడ్చల్ టౌన్, మార్చి 10 : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని చెక్ పోస్టు వద్ద గల సాయి శ్రీ నిలయం వెల్ఫేర్ సొసైటీకి చెందిన దాదాపు రూ.7 కోట్ల రూపాయల విలువచేసే పార్కు స్థలాన్ని కొందరు రాత్రికి రాత్రి కబ్జాచేసి ప్రహరీ నిర్మించటంతో ఆదివారం కాలనీ వాసులు నిరసనకు దిగారు. కాలనీ లేఅవుట్‌లో చూపించిన 1970 చదరపు గజాల స్థలాన్ని ఆరు ప్లాట్లుగా మార్చి భూ భకాసురులు దొంగచాటుగా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని కాలనీవాసులు ఆరోపించారు. ఈ విషయమై అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ పట్టణంలోని సర్వే నెంబర్ 873, 882లో గల 13 ఎకరాల 12 గుంటల స్థలంలో సాయి శ్రీ పేరుతో 256 ప్లాట్లతో లేఅవుట్‌ను తయారు చేశారు. కాగా, మొత్తం లేఅవుట్‌కు గాను 1970 చదరపు గజాల స్థలాన్ని ప్రత్యేకంగా పార్కుకోసం వదలటంతో పాటు సదరు రియల్‌ఎస్టేట్ వ్యాపారి పిల్లలు ఆడుకోవటానికి ఆట పరికరాలు, పెద్దలు కూర్చోవడానికి కుర్చీలు, పార్కు పరిసరాల్లో మొక్కలు ఏర్పాటు చేశారు. లేఅవుట్‌లోని ప్లాట్ల విక్రయాలు పూర్తయిన వెంటనే రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తులు పార్కు స్థలాన్ని ఆరుప్లాట్లుగా మార్చి మరో లేఅవుట్‌ను తయారుచేసి కాలనీ వాసులకు తెలియకుండా ఇతరులకు అమ్ముకున్నారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు రియల్‌ఎస్టేట్ వ్యాపారి తీరును తప్పుపడుతూ పార్కు స్థలం కోసం కేటాయించిన స్థలంలో పార్కును ఏర్పాటుచేయాలని కోరుతూ అధికారులకు ఫిర్యాదు చేశారు.

స్థలంపై కన్నేసిన రియల్టర్

భూముల ధరలు పెరగటంతో లేఅవుట్ తయారు చేసిన రియల్‌ఎస్టేట్ వ్యాపారి పార్కుస్థలాన్ని ప్లాట్లుగా మార్చి అమ్మేశాడని కాలనీవాసులు ఆరోస్తున్నారు. గ్రామ పంచాయతీ లేఅవుట్ కావటంతో పాత సర్పంచ్‌తో ప్లాన్‌ను మార్చి సదరు రియల్‌ఎస్టేట్ వ్యాపారస్తులు అమ్ముకున్నారని ఆరోపిస్తున్నారు. కాగా, కాలనీవాసుల కళ్లుగప్పి రాత్రికి రాత్రి పార్కు స్థలంలో ప్రహరీ నిర్మించి కబ్జాకు పాల్పడినట్లు తెలిపారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారికి అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండటంతో అధికారులు కూడా పట్టించుకోవటం లేదని సొసైటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, న్యాయం జరగకుంటే పార్కు స్థలం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.



ప్లకార్డులతో నిరసనకు దిగిన కాలనీవాసులు

'పార్కు స్థలాన్ని కబ్జా చేయలేదు'

పార్కు స్థలాన్ని కబ్జా చేయలేదని సదరు సాయి శ్రీ రియల్‌ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. లేఅవుట్ ప్రకారం పార్కుకోసం వదిలిన 1570 గజాల స్థలాన్ని సర్వేచేసి కాలనీ సొసైటీకి అప్పగిస్తామని తెలిపారు. అయితే, పార్కు స్థలాన్ని ప్లాట్లుగా మార్చి ఇతరులకు అమ్మామని సొసైటీ సభ్యులు చేస్తున్న ఆరోపణలను సదరు రియల్‌ఎస్టేట్ ప్రతినిధులు తోసిపుచ్చుతున్నారు.

వార్డుకు రూ.10 లక్షలు ఏమయ్యాయ్!

● ఎమ్మెల్యే సూచించినా.. కౌన్సిల్ ఆమోదం తెలిపినా.. ఇప్పటికీ ప్రారంభం కాని ప్రక్రియ
● అధికారుల నిర్లక్ష్యంతో ఆగిన అభివృద్ధి పనులు
● టెండర్ ప్రక్రియ చేపట్టని ఇంజనీరింగ్ విభాగం
● నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి!

తాండూరు, మార్చి 10 : కౌన్సిలర్లు అందరూ నాలుగేళ్ల తర్వాత తీపికబురు వచ్చిందని సంబరపడ్డారు. వార్డుల్లో చిన్న చిన్న సమస్యలైనా తీరుతాయని.. ప్రజల్లోకి దర్జాగా వెళ్లేందుకు అవకాశముటుందని భావించారు. దాంతో కౌన్సిలర్లు వార్డుకు రూ.10 లక్షల చొప్పున ఏకగ్రీవంగా ఆమోద ముద్రవేశారు. అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా నిధుల విడుదలకు మోక్షం కలగలేదు. కమిషనర్, ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యమే వార్డుకు రూ. 10 లక్షలు పెండింగ్‌లో పడ్డాయనే ఆరోపణలున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. ఫిబ్రవరి 19న మున్సిపల్ సాధారణ అంచనా బడ్జెట్ (2024-25) సమావేశం చైర్‌పర్సన్ స్వప్న పరిమళ అధ్యక్షతన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొనగా జరిగింది. సమావేశానంతరం ఎమ్మెల్యే సూచన మేరకు పార్టీలకతీతంగా తాండూరు పట్టణంలోని 36 వార్డులకు.. ఒక్కో వార్డుకు రూ.10లక్షల చొప్పున 14వ, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి పనులు చేయించాలని కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ పనులను చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఆయా పార్టీల ఫ్లోర్‌లీడర్లు అధికారులు కలిసి వార్డులవారీగా పనులకు సంబంధించి కౌన్సిలర్ల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని పనులు చేయించాలని ఎమ్మెల్యే, చైర్‌పర్సన్, కమిషనర్‌ను ఆదేశించారు. అత్యవసర పనుల కింద వెంటనే ప్రక్రియను చేపట్టాలని కౌన్సిలర్లు ఇన్‌చార్జి డీఈఈకి సూచించారు. ఇంతవరకు బాగానే ఉన్నా అధికారులు చేపట్టాల్సిన ప్రక్రియను సకాలంలో పూర్తి చేయలేకపోయారు. ఏవేవో కారణాలు చెబుతూ అధికారులు దాట వేస్తున్నారని పలువురు కౌన్సిలర్లు వాపోతున్నారు. ఎమ్మెల్యే చెప్పినా కౌన్సిలర్లు ఆమోదించినప్పటికీ కమిషనర్, ఇంజనీర్ అధికారుల నిర్లక్ష్యంతో రూ. 10 లక్షలు కేటాయింపు అర్ధంతరంగా నిలిచిపోయాయి. అధికారులకు కౌన్సిల్ సమావేశం తర్వాత 14 రోజుల గడువు ఉన్నప్పటికీ సకాలంలో ప్రక్రియను చేపట్టకపోవడం తాము అనుకున్న పనులకు ప్రాధాన్యతనిస్తూ ఈ పనులకు పక్కకుపెట్టడంతో కౌన్సిలర్లు అందివచ్చిన అవకాశాన్ని అధికారుల నిర్లక్ష్యంతో మరో రెండు నెలలు ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా, మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నోటిఫికేషన్ రావడంతో టెండర్ ప్రక్రియ ను చేపట్టలేదని మాటిచ్చి తప్పారని ఇంజనీరింగ్ అధికారుల తీరు పట్ల కౌన్సిలర్లు మండి పడుతున్నారు.



తాండూరు మున్సిపల్ కార్యాలయం

మానవత్వం చాటుకున్న మంత్రి జూపల్లి

● మూర్ఛతో రోడ్డుపై పడిపోయిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించిన మంత్రి

షాద్‌నగర్ రూరల్, మార్చి 10 : ఆపదలో ఉన్న వ్యక్తిని కాపాడి మంత్రి జూపల్లి కృష్ణారావు మానవత్వం చాటుకున్నారు. మూర్ఛతో సొమ్మసిల్లి రోడ్డుపై పడిపోయిన ఓ వ్యక్తిని ఆయన ఆస్పత్రికి తరలించారు. ఆదివారం ఉదయం జూపల్లి కృష్ణారావు హైదరాబాద్ నుంచి కొల్లాపూర్ వెళ్తుండగా ఫరూక్‌నగర్ మండలం రాయికల్ టోల్ గేట్ సమీపంలో రోడ్డుపక్కన గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉన్నాడు. గమనించిన జూపల్లి తన కాన్వాయ్‌ను ఆపి ఆ వ్యక్తి దగ్గరకు వెళ్లారు. మూర్ఛతో పడిపోయిన అతడికి మంత్రి అనుచరులు సపర్యలు చేయగా మంత్రి అంబులెన్స్‌కు ఫోన్ చేసి అతడిని ఆస్పత్రికి తరలించారు. మూర్ఛ బాధితుడి పట్ల మంత్రి జూపల్లి తీసుకున్న చొరవకు పలువురు అభినందనలు తెలుపుతున్నారు.



అంబులెన్స్‌కు ఫోన్ చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కిటకిటలాడిన భూకైలాస్

● ఆదివారం అమావాస్య కావడంతో ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తుల రాక

తాండూరు రూరల్, మార్చి 10 : తాండూరు మండల పరిధిలోని అంతారం భూకైలాస్ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం అమావాస్య కావడంతో తాండూరులోతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, హైదరాబాద్, వికారాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. నీటి గుండం ద్వారా భక్తులు ద్వాదశజ్యోతిర్లింగాలు, మహాశుడు, ఆలయ ప్రాంగణంలోని దేవతామూర్తులను దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో అలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. ఆలయ వ్యవస్థాపకులు వాసుపవార్ భక్తులకు అన్నదానం నిర్వహించారు. తాండూరు డీఎస్పీ బాలకృష్ణ, సీఐ సంతోష్‌కుమార్, ఎస్‌ఐ కాశీనాథ్ సిబ్బంది అవాంచనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. వాసుపవార్ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

జ్యోతిర్లింగాలను దర్శించుకున్న ఏఎస్పీ

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భూకైలాస్ ద్వాదశ జ్యోతిర్లంగాలను వికారాబాద్ జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి కుటుంబికులతో కలిసి దర్శించుకున్నారు. భూకైలాస్‌లోని ద్వాదశ జ్యోతిర్లింగాలతోపాటు ఇతర దేవతామూర్తులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వాసుపవార్ ఏఎస్పీని, కుటుంబ సభ్యులను సన్మానించారు. ఏఎస్పీ మాట్లాడుతూ ఆలయం అద్భుతంగా ఉందని, దేవతలందరినీ ఒకేచోట దర్శించుకునేందుకు వీలుగా ఉందని తెలిపారు. అదేవిధంగా ఆలయంలో భక్తులకు నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.





శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు; జ్యోతిర్లింగాల దర్శనం చేసుకున్న అనంతరం ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

షాబాద్ : మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం సాయిరెడ్డిగూడలో ఆదివారం బండలాగుడు పోటీలు అట్టహాసంగా జరిగాయి. మహాశివరాత్రిని పురస్కరించుకొని రెండు రోజులుగా మల్లన్న స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. బండలాగుడు పోటీల్లో ప్రథమ బహుమతి సూర్యాపేటకు చెందిన నుంకి సు రేందర్ రెడ్డి గెలుపొందగా రూ.70వేలు షీల్డు అందజేశారు. ద్వితీయ బహుమతి కర్నూలుకు చెందిన కురువ కర్రెప్ప గెలుపొందగా రూ.60వేల నగదు షీల్డు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో లవకుశ వీధినాటకం ప్రదర్శించారు. నాయకులు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లింగం, సతీష్‌చారి, భాస్కర్‌చారి, రాజుగౌడ్, శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు. కాగా, సాయిరెడ్డిగూడలో మల్లన్న స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అనంతరం బండలాగుడు పోటీలకు హాజరయ్యారు.



షాబాద్ : పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు వెంకట్‌రెడ్డి, తదితరులు

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

షాబాద్, మార్చి 10 : లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైతాబాద్, నాందార్‌ఖాన్‌పేట్, లింగారెడ్డిగూడ, సాయిరెడ్డిగూడ, పెదవేడు గ్రామాలకు చెందిన యువకులు నాందార్‌ఖాన్‌పేట్‌లో విశ్వేశ్వర్‌రెడ్డి పెద్దఎత్తున బీజేపీలో చేరారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో భారత్ అభివృద్ధి చెందిన దేశాల్లో చేరిందని, నేడు ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తుందని అన్నారు. ఈసారి ఎన్నికల్లో సర్వేలన్నీ మోదీ సర్కారు గెలుపునే సూచిస్తున్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్డీయే 400 స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాగా, అంతకుముందు లింగారెడ్డిగూడ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం సాయిరెడ్డిగూడలో శివరాత్రిని పురస్కరించుకొని బండలాగుడు పోటీలు నిర్వహించగా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, పార్టీ మండలాధ్యక్షుడు కిరణ్, నాయకులు రాము, మహేందర్, కృష్ణాచారి, రాజీవ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి, రవిగౌడ్, జనార్దన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నారాయణ, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కండువాలు కప్పి యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



కోట్‌పల్లి ప్రాజెక్టులో సందర్శకుల ఎంజాయ్

వికరాబాద్ జిల్లా ధారూరు మండల పరిధిలోని కోట్‌పల్లి ప్రాజెక్టు పరిసరాలు ఆదివారం సందర్శకులతో సందడిగా కనిపించాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు ప్రాజెక్టు ఒడ్డుపై, నీటిలో సెల్ఫీలు, ఫొటోలు దిగుతూ సరదాగా గడిపారు. మరికొందరు ప్రాజెక్టు నీటిలో బోటింగ్ చేస్తూ ఎంజాయ్ చేశారు. - ధారూరు, మార్చి 10



వైభవంగా శివపార్వతుల కల్యాణం

- భక్తి శ్రద్ధలతో ఆలయాల్లో పూజలు
- రథోత్సవం, అన్నదానాలు
- తరలి వచ్చిన భక్తులు, ప్రజాప్రతినిధులు


కేశంపేట : శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

మహేశ్వరం, మార్చి 10 : శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లాలోని వివిధ ఆలయాల్లో శివపార్వతుల కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు చేశారు. పలు చోట్ల దేవాలయాల్లో అన్నదానాలు, రథోత్సవం, నిర్వహించారు. మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయంలో శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి రంగారెడ్డి, వికారాబాద్‌జిల్లాల జడ్పీ చైర్‌పర్సన్‌లు తీగల అనితాహరినాథ్‌రెడ్డి, పట్నం సునీతమహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. భక్తులు పెద్ధ సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్‌ అల్లెకుమార్‌ దంపతులు ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించి ఆలయ ప్రాంగనంలోని కల్యాణమండపం వద్దకు తెచ్చారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనితాహరినాథ్‌రెడ్డి, సునీతారెడ్డి మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధిగాంచిన శ్రీశివగంగరాజరాజేశ్వరస్వామి కల్యాణంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఆలయ అభివృద్ధి కోసం ఎప్పుడు సహకారం అందిస్తామన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రుద్ర హోమం కుంకుమార్చన, మంగళహారతి, సహస్రనామార్చన నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీపీ సునీతఅంద్యానాయక్‌, మాజీ చైర్మన్లు యాదయ్య, ఈశ్వర్‌ముదిరాజ్‌, నిమ్మగూడెం సుధీర్‌గౌడ్‌, సుదర్శన్‌యాదవ్‌, మునగపాటి నవీన్‌, కాకి కుమార్‌, డైరెక్టర్లు రాఖేష్‌, జగన్‌, సాయులు, కన్నయ్య, శ్రీశైలం, నాయకులు, ఈవో మురళీకృష్ణ, ప్రధాన అర్చకులు వీరేషం, తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : మండల పరిధిలోని కాకునూర్‌ గ్రామ శివారులో వెలిసిన మహాలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శివ పార్వతుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ పార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. పండితులు చిదంబరం శర్మ, మహాలింగం, కోటప్ప కృష్ణా గౌడ్‌కీర్తన, గట్ల శివకుమార్‌ రెడ్డిసౌజన్య, శ్రీకాంత్‌ కుసుమ, నవీన్‌శ్రీదేవి, గట్ల వెంకటరాంరెడ్డిరోజా రెడ్డి, సాయిచారిమధుప్రియ, సతీష్‌ కుమార్‌ రెడ్డిఅనిత, సోమశేఖర్‌శ్రీదేవి, శశిధర్‌గౌడ్‌లహరి, మోటే మహిపాల్‌లక్ష్మి వనజ, వెంకటయ్య గౌడ్‌జయమ్మ దంపతులు కల్యాణాన్ని నిర్వహించారు. షాద్‌నగర్‌, ఆమనగల్‌, మహేశ్వరం, హైదరాబాద్‌ నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు తాళ్ల భాగ్యలక్ష్మీ, శ్రీధర్‌గౌడ్‌ దంపతులు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌ తాళ్ల నర్సింలుగౌడ్‌, ప్యాక్స్‌ చైర్మన్‌ గండ్ర జగదీశ్వర్‌ గౌడ్‌, కేశంపేట మాజీ సర్పంచ్‌ తలసాని వెంకట్‌రెడ్డి, యారం శేఖర్‌రెడ్డి, గూడ వీరేష్‌, పట్వారి జగదీశర్వ, యెన్నం శ్రీధర్‌ రెడ్డి, వై. గిరిధర్‌, అనుమగళ్ల రమేష్‌, తమ్మల గోపాల్‌, రాజేందర్‌ రెడ్డి, పర్వతాలు, అనసూయమ్మ పాల్గొన్నారు.

తలకొండపల్లి : మండల పరిధి చెన్నారం గ్రామపంచాయతీలోని మల్లప్పగుట్టపై గల శ్రీమల్లికార్జునస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ముగింపు వేడుకల్లో భాగంగా ప్రత్యేక పూజలు, దేవుని పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. బ్రహ్మోత్సవాల ముగింపు నేపథ్యంలో హుండీలు, ఇతర ఆదాయాల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయానికి ఈ ఏడాది రూ.5,46,433 ఆదాయం లభించింది. హుండీ ఆదాయానికి ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. కల్లు పెంటారెడ్డి, మల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, నారాయణరెడ్డి, అశోక్‌, మల్యానాయక్‌, రంగారెడ్డి, శేఖర్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆమనగల్లు : మంచి మార్గంలో నడవడానికి దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగితే ఆనందమయ జీవితాన్ని పొందుతారని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కల్వకుర్తిలో నిర్వహించిన మహాలక్ష్మీ యాగంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా కసిరెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలోని పురాతన దేవాలయాలను ఆధునీకరించి పూర్వవైభవం తెస్తామన్నారు. కార్యక్రమంలో జూలూరి రమేశ్‌బాబు, బృంగి ఆనంద్‌కుమార్‌, వెంకటేశ్వర్‌రావు, పాల్గొన్నారు.

చేవెళ్ల : అన్నం పరబ్రహ్మ స్వరూపమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా భక్తుల కోసం మాజీ ఎంపీపీ బాల్‌రాజ్‌ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా ఎమ్మెల్యే యాదయ్య ప్రారంభించారు. జాతరకు వచ్చే భక్తుల కోసం అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. నాయకులు యాదగిరి, నర్సింలు, నాయకులు కె. తిరుపతిరెడ్డి, మాణిక్యప్రభు, మాణిక్యం, వెంకటేశ్‌, యాదయ్య, బాలు, భక్తులు ఉన్నారు.

చేవెళ్ల శ్రీలక్ష్మీవెంకటేశర్వస్వామి వారిని ఎమ్మెల్యే మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కాంగ్రెస్‌ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జీ పామెన భీంభరత్‌లు ఆదివారం వారు వేర్వురుగా వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు శ్రీకాంతచారి, శ్రీపాదులు ఘనంగా స్వాగతం పలికి స్వామి వారి సన్నిధిలో దర్శనం అనంతరం ఘనంగా సత్కరించారు. పీఏసీఎస్‌ చైర్మన్లు దేవర వెంకట్‌రెడ్డి, గోనె ప్రతాప్‌రెడ్డి, యాదగిరి, తిరుపతిరెడ్డి, నర్సింలు, మహేశ్‌, నాయకులు ఉన్నారు.

మహాశివరాత్రి సందర్భంగా భక్తుల కోసం ఉచితంగా అన్నదానం చేయడం అభినందనీయమని చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి వారి పుష్కరణి ఆవరణలో జాతరకు వచ్చే భక్తుల కోసం చేవెళ్ల గ్రామానికి చెందిన యువనాయకుడు అత్తెల్లి జగన్నాథ్‌రెడ్డి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జగన్నాథ్‌రెడ్డిని సీఐ అభినందించారు. బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డి, ఆలయ పూజారి శ్రీపాదు, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, అరుణ్‌రెడ్డి, జంగయ్య, జి. శ్రీకాంత్‌ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వంశిధర్‌రెడ్డి, శ్రీకర్‌రెడ్డి, భక్తులు తదితరులు ఉన్నారు.

కొత్తూరు : అన్నదానాన్ని మించిన దానం మరొకటి లేదని షాద్‌నగర్‌ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్‌ వద్ద గల శివాలయంలో శివరాత్రి ముగింపు ఉత్సవాల్లో ఆయన పాల్గొన్ని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరు సేవాదృక్పథంతో ముందుకు సాగి, తోచిన సహాయం చేయాలన్నారు. మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, పీర్లగూడెం మహేష్‌గౌడ్‌, వస్పుల మహేందర్‌, శివ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్లమ్మ బోనాల జాతర

మహేశ్వరం : మండల పరిధిలోని మన్‌సాన్‌ పల్లి గ్రామంలో కొలువుదీరిన శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం బోనాల జాతరకు సిద్ధమైంది. ఈ నెల 11 (ఈరోజు) నుంచి 14 వరకు బోనాల జాతర జరుగబోతుంది. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్‌ దీపాలతో అలంకరించారు. జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ మర్యాద మురళీధర్‌రెడ్డి తెలిపారు. 11న సాయంత్ర ఒగ్గు వారిచే గంగతెప్ప కార్యక్రమం నిర్వహిస్తారు. 12న అమ్మవారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పాలంకరణ కార్యక్రమాలు, 13న అభిషేకాలు, ఒగ్గుకథలు, 14న బోనాల ఊరేగింపు నిర్వహిస్తారు.

ఆమనగల్లు : మండల పరిధిలోని పోలెపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు ముస్తాబైంది. ఈనెల 19 నుంచి 21వ తేది వరకు నిర్వహించే వే డుకలకు ఆలయాన్ని శోభాయమానంగా అలంకరిస్తున్నారు. విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన క రపత్రాలు, వాల్‌ పోస్టర్లు ఆదివారం ఉత్సవ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఉత్సవాలకు హజరు కావాలని ఎంపీ రాములు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాల కోసం హజరయ్యే భక్తులకు కవాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు లాలయ్య, వగ్గు ప్రబాకర్‌, దశరథం, కృష్ణయ్య, వెంకటయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.


మహేశ్వరం : కల్యాణానికి హాజరైన సునీతారెడ్డి, అనితారెడ్డి


చేవెళ్ల : భక్తులకు అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య


చేవెళ్ల : భక్తులకు అన్నదానం చేస్తున్న సీఐ లక్ష్మారెడ్డి


ఆమనగల్లు : మహాయాగంలో ఎమ్మెల్యే కసిరెడ్డి

క్రైం కార్నర్

పేకాట ఆడుతున్న 14 మంది అరెస్టు


పట్టుబడిన నగదు, సెల్‌ఫోన్‌లు

చేవెళ్ల, మార్చి 10 : ఓ ఫామ్‌హౌస్‌లో పేకాట స్థావరంపై ఎస్వోటీ పోలీసులు దాడి చేసి 14 మందిని అరెస్టు చేసిన సంఘటన శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన ప్రకారం ఇలా ఉన్నాయి. నగరానికి చెందిన పలువురు వ్యక్తులు శంకర్‌పల్లి మున్సిపాలిటీ బుల్కాపూర్‌ గ్రామం పరిధిలో ఉన్న ఓ ఫామ్‌హౌస్‌లో పేకాట ఆడుతున్నారనే సమాచారం తెలుసుకున్న రాజేంద్రనగర్‌ ఎస్వోటీ పోలీసులు దాడులు చేశారు. 14 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,24,260 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని శంకర్‌పల్లి పోలీసులు చెప్పారు.

చెరువులో మునిగి విద్యార్థి దుర్మరణం


చరణ్‌(ఫైల్‌)

మాడ్గుల, మార్చి 10 : చేపలు పట్టడానికి వెళ్లి చెరువులో మునిగి ఓ విద్యార్థి మృతిచెందిన సంఘటన మాడ్గుల మండలంలోని పల్లెతండాలో చోటు చేసుకొంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెతండాకు చెందిన కేతావత్‌ జ్యోతి సేవ్యా దంపతుల కుమారుడు చరణ్‌(14) మండల కేంద్రంలోని సెంట్‌ మేరీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. తన ఇద్దరు స్నేహితులతో కలిసి శనివారం నర్సంపల్ల చెరువులోకి చేపలు పట్టటానికి వెళ్ళాడు. ముగ్గురు కలిసి చేపలకోసం చెరువులోకి దిగారు. చెరువులోని బుంగలో ఇరుక్కొని ఈతరాక పోవటంతో చరణ్‌ నీటమునిగాడు. తోటి స్నేహితులు కేకలు వేయడంతో పక్కనే వ్యవసాయ పనులు చేస్తున్న వారు వచ్చి అతన్ని బయటకు తీశారు. విషయం తెలిసి అతని కుటుంబసభ్యులు అక్కడికి వెళ్లే సరికే ప్రాణాపాయ సిత్థిలోకి వెళ్లాడు. కుటుంబసభ్యులు వెంటనే అతన్ని దేవరకొండ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

మొయినాబాద్‌, మార్చి 10 : వరకట్నం వేధింపులు భరించలేక ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. సరూర్‌నగర్‌ మండల పరిధిలోని నందనవనం గ్రామానికి చెందిన బీమమ్మ కుమార్తె లావణ్య(18) వివాహం సంగారెడ్డి జిల్లా చెర్లగూడెం గ్రామానికి చెందిన పందిగోటె రవితో నాలుగు నెలల క్రితం పెద్దల సమక్షంలో జరిగింది. బతుకు దెరువు కోసం వచ్చి మండల పరిధిలోని చిల్కూర్‌ గవర్నమెంట్‌ క్వార్టర్స్‌లో కూలీ పని చేసుకుంటూ వారు జీవనం సాగిస్తున్నారు. వివాహం జరిగిన కొద్ది రోజులు వీరి కాపురం సాఫీగానే సాగింది. కానీ నెల రోజుల నుంచి భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని లావణ్య తన తల్లితో చెప్పడంతో పెద్దమనుషులు భార్యతో గొడవ పడొద్దని రవికి నచ్చజెప్పారు. అయినా అతనిలో మార్పురాలేదు. కాగా పెళ్లి సమయంలో కట్నం ఇవ్వలేదని ఆ డబ్బులు తీసుకురావాలని రవి లావణ్యను వేధించేవాడు. ఈ విషయాన్ని లావణ్య తన తల్లితో చెప్పడంతో ఆమె రవికి ఫోన్‌ చేసి భార్యతో గొడవపెట్టుకోవద్దని సూచించింది. కాగా ఆదివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని లావణ్య ఆత్మహత్య చేసుకుంది. అయితే రవి వరకట్నం వేధింపుల వల్లనే లావణ్య చనిపోయిందని ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

కేడియా సిల్క్‌మిల్‌లో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న ఫైర్‌ సిబ్బంది

కొత్తూర్‌, మార్చి 10 : కొత్తూర్‌ మున్సిపాలిటీలోని పెంజర్ల రోడ్డులో గల కేడియా సిల్క్‌మిల్‌ పరిశ్రమలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పరిశ్రమ బయట ఉన్న చెట్లు, చెత్త నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో సిబ్బంది గమనించి వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వారు షాద్‌నగర్‌లోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్‌ఇంజన్‌తో మంటలను ఆర్పివేశారు. మంటలు పరిశ్రమ లోపలికి వ్యాపించి ఉంటే భారీ నష్టం జరిగి ఉండేదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. ఈ ప్రమాదంలో ఎటువంటి నష్టం జరగలేదని వారు చెప్పారు. ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

అధిక లాభాల ఆశ చూపి రూ.80 వేలు కొట్టేసిన సైబర్‌ నేరస్థులు

శంషాబాద్‌ రూరల్‌, మార్చి 10 : సైబర్‌ క్రైం నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నా ప్రజల నిర్లక్ష్యంతో సైబర్‌ నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. అధికలాభాలు వస్తాయని ఆశచూపి సైబర్‌ నేరాగాళ్లు రూ.80 వేలు కొట్టేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఊట్‌పల్లికి చెందిన భార్గవి గత ఏడాది ఆగస్టులో ఆన్‌లైన్‌లో ఒక ప్రకటన చూసింది. అందులో ఉన్న ఫోన్‌ నెంబర్‌కు కాల్‌ చేసింది. సైబర్‌ నేరస్తులు రూ. 80 వేలు వేస్తే అధిక లాభలు వస్తాయని చెప్పడంతో ఆన్‌లైన్‌లో ఆమె వారికి డబ్బులు వేసింది. తిరిగి కాల్‌ చేస్తే వారి ఫోన్‌ కలవలేదు. దీంతో అప్పట్లో శంషాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయితే డబ్బులు పడ్డా అకౌంట్‌ను సైబర్‌ క్రైం పోలీసులు ఫ్రీజ్‌ చేశారు. దీంతో ఆ డబ్బులు అకౌంట్‌లోనే ఉన్నాయి. దీంతో పోలీసులు మళ్లీ రెండు రోజుల క్రితం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో ఉందని చెప్పారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి మృతి

చౌదరిగూడ, మార్చి 10 : చెరువులో చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి నీటిలో మునిగి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎదిర గ్రామానికి చెందిన వడ్డె తిమ్మయ్య(40) అనే వ్యక్తి శనివారం ఉదయం గ్రామ శివారులోని చెరువులో చేపలను పట్టేందుకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల ఎక్కడ వెతికినా కనిపించలేదు. ఆదివారం ఆ చెరువులో శవమై కనిపించాడని తెలిపారు. మృతుడి తమ్ముడు వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యం స్వాధీనం

యాచారం, మార్చి 10 : అక్రమంగా తరలిస్తున్న రేషన్‌ బియ్యంతో పాటు, నిల్వ చేసిన మద్యాన్ని ఆదివారం సాయంత్రం యాచారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని మంతన్‌గౌరెల్లిలో ఎస్సై గోపాల్‌ వాహనాలను తనిఖీ చేస్తుండగా యాదగిరి అనే వ్యక్తి రెండు క్వింటాళ్ల రేషన్‌ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఇదే గ్రామంలో శంకర్‌ అనే వ్యక్తి తన ఇంట్లో రూ.రెండు వేల ఐదువందల విలువైన మద్యాన్ని నిల్వ చేసి ఉండగా పట్టుకున్నట్లు ఎస్సై చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

చేవెళ్ల, మార్చి 10 : నేడు (సోమవారం) మండల కేంద్రంలో కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తల సమావేశం కేజీఆర్‌ గార్డెన్‌లో ఉదయం 11 గంటలకు ఉంటుందని నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్‌ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌ తెలిపారు. ఈ కార్యక్రమానికి వికారాబాద్‌ జిల్లా పరిషత్‌ చైర్‌పర్సన్‌ సునీతా రెడ్డి, జిల్లా డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారని చెప్పారు.

ఆమనగల్లు, మార్చి 10: మండల పరిధిలోని గౌరారం గ్రామానికి చెందిన శెట్టిపల్లి బక్కయ్య అనారోగ్యంతో మృతి చెందగా రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నిట్ట నారాయణ, ఎంపీటీసీ నిట్ట మంగమ్మ సందర్శించి మృతుడి కుటుంబానికి రూ. 2500 ఆర్థిక సాయం అందజేశారు.

మరోమారు బీజేపీదే అధికారం


నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ రాములు

ఆమనగల్లు , మార్చి 10: పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, కేంద్రంలో మరోమారు బీజేపీదే అధికారమని నాగర్‌కర్నూల్‌ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన పార్టీ శ్రేణులతో పార్లమెంట్‌ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ నియోజకవర్గంలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు అశోక్‌రెడ్డి, మల్లికార్జున్‌, నరేశ్‌, భరత్‌ప్రసాద్‌, యాదగిరిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


విజేత జట్టుకు నగదు అందిస్తున్న చంద్రశేఖర్‌

యాచారం, మార్చి 10 : క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీఎస్‌రెడ్డి ట్రస్ట్‌ చైర్మన్‌ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి జాగారం సందర్భంగా నందివనపర్తి గ్రామంలో జ్యోతి ఎడ్యుకేషన్‌ యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో వాలీబాల్‌ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలిచిన జట్టుకు శనివారం రాత్రి ఆయన రూ.30వేల నగదు బహుమతిని అందించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో యువకులు పాలుపంచుకోవాలన్నారు. యువత ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు అండగా ఉంటానన్నారు.

రేపు ఎల్బీ స్టేడియంలో విజయ సంకల్ప సభ

కొత్తూర్‌, మార్చి 10 : మంగళవారం (12న) హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో బీజేపీ బూత్‌ కమిటీలు, శక్తికేంద్రాలు, ముఖ్యనాయకులతో విజయ సంకల్ప సభ జరుగనుందని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి దేపల్లి అశోక్‌గౌడ్‌, మహబూబ్‌నగర్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ కోకన్వీనర్‌ అమడపురం నర్సింహాగౌడ్‌ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఉమ్మడి కొత్తూర్‌ మండల నాయకుల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. విజయసంకల్ప సమావేశాన్ని జయప్రదం చేసేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు నడుంబిగించాలని, ఈ సమావేశానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎర్రవెల్లి నాగరాజుచారి, రణధీర్‌గౌడ్‌, రమేష్‌, శేఖర్‌గౌడ్‌, కుమార్‌, శివలింగం, బొడ్డు జగన్‌, కృష్ణమోహన్‌, అరవింద్‌, గణేష్‌, శ్రీశైలం, కోస్గి మల్లేష్‌, భానుప్రకాష్‌, సందీప్‌సింగ్‌, ప్రభాకర్‌చారి, రవి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆదర్శం సావిత్రిబాయిపూలే

చేవెళ్ల, మార్చి 10 : మహిళలకు ఆదర్శం సావిత్రి బాయిపూలే అని, ఆమె జీవితం, పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి అన్నారు. ఆదివారం సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన తొలితరం ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ చారి, మండల సహాయ కార్యదర్శి ఎండి మగ్బూల్‌, మహిళాసంఘం మండల అధ్యక్షురాలు వడ్ల మంజుల, పెంటయ్య, నర్సింహా, చంద్రమౌస్‌, సావిత్రి, లలిత, భాగ్యమ్మ ఉన్నారు.


కడ్తాల : నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

కడ్తాల్‌ : సావిత్రిబాయిపూలేను ఆదర్శంగా తీసుకొని మహిళలు ముందుకు సాగాలని టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్‌ అన్నారు. మహిళా విద్యకు తన జీవితాన్ని అంకితంచేసిన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. సావిత్రిబాయిపూలే వర్ధంతి సందర్భంగా కడ్తాల మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో ఘన ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు యాట నర్సింహా, కాంగ్రెస్‌ జిల్లా నాయకులు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మోత్యనాయక్‌, గూడూరు బాస్కర్‌రెడ్డి నాయకులు చేగూరి వెంకటేశ్‌, జహంగీర్‌బాబా, మాలె మల్లేశ్‌గౌడ్‌, జహంగీర్‌ అలీ, మోత్యానాయక్‌, రాజేందర్‌ గౌడ్‌, సత్యం, పాల్గొన్నారు. బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్‌ ఆధ్వర్యంలో సావిత్రి బాయిపూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మూడ రవి, రాజేందర్‌, రవీందర్‌రెడ్డి, శంకర్‌, రాజేశ్‌, మహేశ్‌, ప్రవీన్‌ గౌడ్‌, దాసు, అశోక్‌, పాల్గొన్నారు. తెలంగాణ యువజన సంఘాల అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్‌ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి నిర్వహించారు. మాదవులు, మహేశ్‌, సంజీవ్‌, రాఘవేందర్‌, వెంకటేశ్‌, మల్లేశ్‌ పాల్గొన్నారు.


చేవెళ్ల : నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చేవెళ్ల, మార్చి 10 : మొయినాబాద్‌లోని ఎంఆర్‌సీహెచ్‌ఎస్‌లో పదోతరగతి కలిసి చదువుకున్న విద్యార్థులు 32 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఆదివారం చేవెళ్ల మండల పరిధిలోని అంతారం సమీపంలోని ఓ ఫామ్‌ హౌస్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారంతా ఆప్యాయంగా పలుకరించుకున్నారు. నాటి స్నేహితులను కలుసుకోవడంతో పలువురి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఈ సందర్భంగా వారి ఉపాధ్యాయలను ఘనంగా సన్మానించారు. పూర్వవిద్యార్థులు బండారి ఆగిరెడ్డి, దేవ శ్రీనివాస్‌రెడ్డి, మర్రి రవిబాబు, కె.రామకృష్ణ, కవిత, అనసూయ, రవీందర్‌, చంద్ర, ప్రకాశ్‌గౌడ్‌, శివకుమార్‌, పాటి రాఘవేందర్‌రెడ్డి, సితాలే నవీన్‌కుమార్‌, శివకుమార్‌ ఉన్నారు.



చేవెళ్ల : గురువుతో పూర్వ విద్యార్థులు


యాచారం : పూర్వ విద్యార్థులు

యాచారం : తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి తాము పాటుపడతామని మండలంలోని చౌదర్‌పల్లి పాఠశాల 7వ తరగతి (1996-97) పూర్వవిద్యార్థులు చెప్పారు. ఆదివారం వారు ఓ ఫంక్షన్‌ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఆనాటి గురువులను సత్కరించారు. జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. పాఠశాల పూర్వవిద్యార్థులు ఎస్సై శ్రీశైలం, సొసైటీ సీఈవో నాగరాజు తదితరులున్నారు.

చిరస్మరణీయుడు సతీషన్‌నాయర్‌

కేశంపేట, మార్చి 10 : షాద్‌నగర్‌, శంషాబాద్‌, షాబాద్‌, చేవెళ్ల ప్రజల్లో భక్తిభావం పెంపొందించిన దివంగత సతీషన్‌నాయర్‌ గురుస్వామి చిరస్మరణీయుడని కేశంపేట మాజీ ఎంపీపీ సజ్జల విశ్వానాథం, మాజీ సర్పంచ్‌లు యెన్నం శ్రీధర్‌రెడ్డి, తలసాని వెంకట్‌రెడ్డి కొనియాడారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమనగల్‌ లయన్స్‌క్లబ్‌, కేశంపేట అయ్యప్ప సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఆయన జ్ఞాపకారం ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 51 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అంతకు ముందు సతీషన్‌నాయర్‌ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్‌ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీశైలంగౌడ్‌, లయన్స్‌క్లబ్‌ సభ్యుడు అంజిరెడ్డి, ప్యాక్స్‌ డైరెక్టర్లు, మఠం శేఖర్‌, మధుసూదన్‌గౌడ్‌, అయ్యప్ప సేవాసమితి సభ్యులు వీరమళ్ల సంతోష్‌, పాండు గౌడ్‌, తిరుమలేష్‌గౌడ్‌, శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌, మహేష్‌, పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

అసలే రద్దీ.. ఆ షాపులతో మరింత ట్రాఫిక్‌ జాం


మద్యం షాపుల వద్ద రద్దీ

శంషాబాద్‌, మార్చి 10 : ప్రధాన రహదారులపై మద్యం షాపులు ఉండటంతో స్థానికులు, వాహనదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వాహనాల రద్దీతో ట్రాఫిక్‌ పోలీసులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శంషాబాద్‌ మున్సిపల్‌ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి రాళ్లగూడ వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా మద్యం షాపులున్నాయి. వచ్చిపోయే వినియోగదారులతో నిత్యం అవి రద్దీగా ఉంటున్నాయి. దీంతో కాలనీవాసులు, వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మద్యం షాపుల వద్ద నిత్యం మందుబాబులు ఉండడం చూసి మండిపడుతున్నారు. ఇది చాలదన్నట్టు ఈ మార్గంలో తరుచూ ట్రాఫిక్‌జాం అవుతుండడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా బస్టాండు నుంచి షాబాద్‌ వెళ్లే రోడ్డులో వాహనాల రద్దీ పెరిగిపోయింది. ఈ రోడ్డు కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు వెళ్లే దారులను కలుపడంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు సైతం ఈ రోడ్డు నుంచే ప్రయాణం చేస్తుంటారు. హైదరాబాద్‌ నుంచి షాబాద్‌ వరకు వెళ్లే సబర్బన్‌, డిస్ట్రిక్‌ సర్వీసుల సంఖ్య కూడా గతం కంటే ఇప్పుడు రెట్టింపయ్యింది. దీంతో ఈ రోడ్డులో వాహనాల రాకపోకల రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. వ్యాపారం బాగా జరుగుతుందనే ఉద్దేశంతో బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు. ఇలా రోజురోజుకు వాహనాల రద్దీ పెరగడం, అదే రోడ్డులో మద్యం షాపులు ఉండటంతో తమకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని బస్తీవాసులు వాపోతున్నారు. కాగా ఇదే రోడ్డులో మండల సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయం, విద్యాసంస్థలు ఉండటంతో వచ్చిపోయే విద్యార్థుల సంఖ్య కూడా ఎక్కువే ఉంటుంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో మద్యం షాపుల వల్ల మరింత ట్రాఫిక్‌ జాం అవుతోందని, వాటిని ఇక్కడి నుంచి తొలగించాలని బస్తీవాసులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.